## క్లుప్తంగా

### రైతు బీమాకు దరఖాస్తు చేసుకోవాలి



మాగనూర్: ఈ ఏడాది కొత్తగా పట్టా పాసు బుక్కులు పొందిన రైతులతోపాట గతంలో తమ పేర్లు నమోదు చేసుకోని వారు రైతు బీమాకు దరఖాస్తు చేసుకోవాలని ఇన్‌చార్జి ఏఓ సుదర్శన్‌గౌడ్ అన్నారు. ఈ మేరకు.. శుక్రవారం మండల పరిధిలోని అడవిసత్యారం రైతువేదికలో అర్హులైన రైతుల నుంచి దరఖాస్తులు తీసుకున్నారు. కొత్తగా భూమి పట్టా పాసు బుక్కులు పొంది ఉంటే ఆధార్ కార్డు, పట్టా పాస్‌బుక్, నామిని ఆధార్ జిరాక్స్‌లతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆయా క్లస్టర్ల ఏఈఓలు పాల్గొన్నారు.

### పాలిసెట్ ప్రత్యేక విడత ప్రవేశాలు..

కోస్గి: పాలిటెక్నిక్‌లో కౌన్సిలింగ్ ద్వారా చేపడుతున్న సీట్లకు సంబంధించి ప్రత్యేక విడత ప్రవేశాలు నిర్వహిస్తున్నట్లు స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ పరమేశ్వరీ ఒక ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్‌లో స్లాట్ బుక్ చేసుకున్న వారికి ఈ నెల 27న ధ్రువపత్రాల పరిశీలన చేస్తామన్నారు. 27, 28తేదీలో వెబ్ ఆప్షన్లు నమోదుచేసుకోవాలని, ఈ నెల 31న సీట్లు కేటాయించి ఎంపికై న విద్యార్థులను జాబిత ప్రకటిస్తామన్నారు. ఈ అవకాశాన్ని పాలిసెట్ రాసి సీటు రాని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

### ఎంఈఓగా గోపాల్ నాయక్



నర్వ: మండల ఎంఈఓగా గోపాల్‌నాయక్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇటీవల ఇక్కడ పనిచేస్తున్న ఇన్‌చార్జి ఎంఈఓ నర్సింహులు పదవీ విరమణ చేయడంతో ఆయన స్థానంలో గోపాల్‌నాయక్ పూర్తిస్థాయిలో బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలోని 19గ్రామాల్లోని విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం కృషిచేస్తానని, విద్యాభివృద్ధికి అందరి సహకారంతో ముందుకు వెళ్తా ఉత్తమ సేవలందించేందుకు తన వంతు పాటుపాడుతానన్నారు.

### తహసీల్దార్‌గా అమరేందర్ కృష్ణ



నారాయణపేట రూరల్: నూతన తహసీల్దార్ అమరేందర్‌కృష్ణ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. వికారాబాద్ జిల్లా నుంచి ఆయన ఇక్కడికి రాగా స్థానికంగా పనిచేస్తున్న రాణా ప్రతాప్‌సింగ్ హైదరాబాద్‌కు బదిలీపై వెళ్లారు. దీంతో పాటు డిప్యూటీ తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న నారాయణ సైతం నాగర్‌కర్నూల్ జిల్లాకు బదిలీ కాగా వారు ఇరువురు రిలీవ్ అయ్యారు. ముగ్గురికి మాజీ ఎంపీపీ అమ్మకోళ్ల శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ బాలప్ప, బస్వరాజ్, గిరిజన టీచర్ల సంఘం నాయకులు వాల్యానాయక్, తిరుపతినాయక్, తార్యానాయక్, డాక్టర్ రవినాయక్‌లు వేర్వేరుగా శాలువాతో సన్మానం చేశారు.

**తహసీల్దార్‌గా జి. కల్యాణి**

ఊట్కూరు: మండల తహసీల్దార్‌గా శుక్రవారం జీ. కల్యాణి పదవీ బాధ్యతలు చేపట్టారు. మండలంలో విధులు నిర్వహిస్తున్న మమత సంగారెడ్డి జిల్లాకు బదిలీపై వెళ్లారు.

### బడ్జెట్ ప్రసంగమా.. రాజకీయ ప్రసంగమా ?

నారాయణపేట: రాష్ట్ర ఆర్థిక శాఖా మంత్రి బడ్జెట్ ప్రసంగంలా కాకుండా రాజకీయ ప్రసంగంలా ఉందని బీజేపీ రాష్ట్ర సీనియర్ నేత నాగురావు నామాజీ శుక్రవారం ఒక ప్రకటనలో ఎద్దేవా చేశారు. గ్యారంటీలు, హామీలతో ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ బడ్జెట్‌లో గ్యారంటీల అమలు ప్రస్తావన, నిధులు కేటాయింపు చేయకుండా గాలికి వదిలేసిందన్నారు. హామీలు ఎలా అమలు చేస్తారో చెప్పకుండా మంత్రి ఎంతసేపు గత ప్రభుత్వం ఖజానా ఖాళీ చేసిందని దానిని తాము పుడుస్తున్నామని విమర్శలు చేస్తూ రాజకీయ ప్రసంగం చేశారన్నారు. గత ప్రభుత్వం అప్పులు చేసినందుకే ఇంటికి పంపారని, ఈ ప్రభుత్వం అప్పుచేసి పప్పు కూడు తినేలా వ్యవహరిస్తున్నదని విమర్శించారు.

### సాగునీటి విడుదలపై హర్షం

మక్తల్: మండలంలోని సంగంబండ రిజర్వాయర్‌ను సీపీఎం జిల్లా కార్యదర్శ వెంకట్‌రాంరెడ్డి, కార్యవర్గసభ్యులు ఆంజనేయులు, గోవిందురాజు శుక్రవారం సందర్శించారు. అనంతరం లోలెవల్ లెఫ్ట కెనాల్ కాల్వపనులు పూర్తి చేసి తొమ్మిది గ్రామాలకు 5వేల ఎకరాలకు సాగునీరు అందించడం హర్షణీయమని అన్నారు. అదేవంధంగా కాల్వల మ్మత్తుపనులు, పూర్తిచేసి రైతులకు సాగునీరు అందించాలని కోరారు.

# ఉద్యాన పంటలపై అనాసక్తి

- పక్క రాష్ట్రాల కూరగాయలే దిక్కు
- దిగుమతితో పెరుగుతున్న ధరలు
- మండలంలో 50 ఎకరాలోపే సాగు
- ప్రజల అవసరాలకు సరిపడని పరిస్థితి



మరికల్ వారంతపు సంతాలో కూరగాయలు కొనుగోలు చేస్తున్న ప్రజలు

మరికల్: రైతులు కూరగాయల సాగుపై పెద్దగా ఆసక్తి చూపకపోవడంతో ఆ సాగు ఏటేటా తగ్గుతుంది. పండించే కూరగాయలు ప్రజల అవసరాలకు సరిపోగా పక్క రాష్ట్రాలు, జిల్లాల నుంచి దిగుమతి చేసుకోవాల్సిన పరిస్థితి ఉంది. దీంతో కూరగాయల ధరలు మండిపోతున్నాయి. బీరకాయ, టమాట, బెండ, క్యాప్సికం, వంకాయలు, పచ్చిమిర్చి కిలో రూ. 60కి పైగా విక్రయిస్తున్నారు. సాధారణ పంటలు సాగుచేస్తున్న రైతులు మార్కెట్‌లో డిమాండ్ ఉన్న కూరగాయలు పండించాలని ఉద్యానశాఖ అధికారులు అవగాహన కల్పించడంలో విఫలం కావడంతో రైతులు ఉద్యాన పంటల వైపు చూడటం లేదు.

**కర్ణాటక.. ఆంధ్ర నుంచి దిగుమతులు**

జిల్లాకు సమీపంలోని కర్ణాటక రాష్ట్రం రాయచూర్, యాద్గీర్, ఆంధ్ర రాష్ట్రం కర్నూల్ జిల్లాల నుంచి కూరగాయలు దిగుమతి అవుతున్నాయి. దూర ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకుంటుండటంతో రవాణా ఖర్చులు కలిపి వ్యాపారులు కూరగాయల ధరలను నిర్ణయిస్తున్నారు. జిల్లాలో సమృద్ధిగా వర్షాలు కురుస్తున్న రైతులు కూరగాయల సాగు తగ్గించి వరిపైనే మక్కువ చూపుతున్నారు. ఉద్యానశాఖ అధికారులు మార్కెట్‌లో కూరగాయలు ఉన్నా డిమాండ్‌పై రైతులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పిస్తే జిల్లాలో సాగుపెరిగే అవకాశం ఉంది.

| కూరగాయల సాగు | |
|---|---|
| జిల్లా జనాబా: 5,72,974 | కూరగాయల సాగు: (ఎకరాల్లో): 1,035 |
| దిగుబడి (టన్నుల్లో): 12 | అవసరం (టన్నుల్లో): 120 |

**ఇక్కడ పరిస్థితి ఇది..**

మరికల్, ధన్వాడ, ఊట్కూర్, దామరగిద్ద, కోస్గి మండలాల్లో మాత్రమే అరకొరగా కూరగాయలు సాగు చేస్తున్నారు. ఇవి ఆయా మండలాల అవసరాలకు ఏ మాత్రం సరిపోవడం లేదు. ఇక్కడ కేవలం అర్ధ ఎకరా లేక ఎకరాలోపు మాత్రమే సాగుచేయడంతో సరిపడటం లేదు. ఒక రైతు రెండు నుంచి మూడు ఎకరాలకు పైగా కూరగాయలను సాగుచేస్తే ఇతర పంటలకు మార్కెటింగ్ చేస్తే మంచి లాభాలు ఉంటాయని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ పరిస్థితి లేకనే గ్రామాల్లో జరిగే వారాంతపు సంతలకు ఇతర ప్రాంతాల నుంచి తెచ్చిన కూరగాయలను అమ్ముతున్నారు. నారాయణపేట, మక్తల్, మద్దూరు, మరికల్ మండలాల్లో జరిగే వారంతపు సంతలకు ఎక్కువగా కర్ణాటకలోని రాయచూర్ నుంచి దిగుమతి అవుతున్నాయి. 70శాతం ఇతర ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకున్నవే జిల్లా అవసరాలను తీర్చడం విశేషం. ఇక్కడ కేవలం టమాట, బీర, బెండ, దొండ, చిక్కుడు, ఆకు కూరగాయలను మాత్రమే నామమాత్రంగా పండిస్తున్నారు.

**రాయచూర్ నుంచి దిగుమతి..**



గత పదేళ్ల నుంచి కూరగాయల వ్యాపారం చేస్తున్నాను. జిల్లాలోని రైతులు ప్రజలకు సరిపడే కూరగాయలు పండించడం లేదు. ఆశించిన స్థాయిలో దిగుబడి లేక నిత్యం రాయచూర్ నుంచి వివిధ రకాల కూరగాయలను దిగుమతి చేసుకొని ప్రజలకు విక్రయిస్తున్నాం.

– కతల్, కూరగాయల వ్యాపారి, మరికల్

**అవగాహన కల్పిస్తున్నాం..**

కూరగాయల సాగు విస్తీర్ణకోసం రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. ఇందుకు ప్రభుత్వం అందించే సబ్సిడీపై కూడా వివరిస్తున్నాం. వరికి బదులు రైతులు అక్కడక్కడ పందిరి కూరగాయల సాగుపై దృష్టిసారిస్తే ఎకరాకు ఏడాదికి రూ. 3 లక్షలకు పైగా ఆదాయం వచ్చే అవకాశం ఉంది. ఎకరా నుంచి మూడు ఎకరాల వరకు సాగుచేస్తే ఏడాదికి మిగితా పంటలకు కంటే మంచి లాభాలను పొందే అవకాశం ఉంది.

– వెంకటేశ్వర్లు, ఉద్యానశాఖ అధికారి, నారాయణపేట

## మహిళలు ఆర్థికంగా ఎదగాలి



అవగాహన కల్పిస్తున్న డీపీఎం రాము నాయక్

మాగనూర్: మహిళలు ఆర్థికంగా ఎదగాలని డీపీఎం రామునాయక్ కోరారు. శుక్రవారం మండల పరిధిలో కేటాయించిన మహిళాశక్తి యూనిట్ల గ్రౌండింగ్‌పై స్థానిక మహిళా సమాఖ్య కార్యవర్గ సమావేశంలో సభ్యులకు అవగాహన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు.. మహిళాశక్తి కార్యక్రమ ఉద్దేశాలు, విధి విధానాలు, గ్రౌండింగ్‌కు అనుసరించాల్సిన కార్యాచరణపై వారికి అవగహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 18రకాల కార్యక్రమాలకు గాను 242 యూనిట్లు ఇందులో గ్రూప్ యాక్టివిటీ కింద రూ. 5 లక్షల నుంచి రూ. 20 లక్షల వరకు పీఎంఈజీపీ బ్యాంక్ లింకేజీ ద్వారా రుణాలు అందించనున్నట్లు తెలిపారు. వ్యక్తిగత యూనిట్లకు ముద్ర, స్త్రీనిధి ద్వారా అవసరమైన నిధులు అందించనున్నట్లు పేర్కొన్నారు. ఆయా రంగాల్లో అభిరుచి గల ఏఎల్ఎఫ్‌లు యూనిట్ల స్థాపనకు ముందుకు రావాలని సూచించారు. లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా చేపట్టాలని సిబ్బందికి ఆదేశించారు. ఏపీఎం వనిత కూమార్, సీసీలు గంగాధర్, చిన్న కుర్మన్న, అరుణ జ్యోతి, ఎంఎంఎస్ కో–శాధికారి మల్లమ్మ, రుక్మిణీ, ఆంజనేయులు పాల్గొన్నారు.

## సమస్యలు పరిష్కారమయ్యే వరకు పోరాటం



సభ్యత్వ నమోదు పత్రాలను అందజేస్తున్న నాయకులు

దామరగిద్ద: ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారమయ్యే వరకు టీఎస్‌పీఆర్టీయూ నిరంతరం పోరాటం చేస్తుందని జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నర్సింహారెడ్డి, జనార్ధన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని ఆయా ప్రభుత్వ పాఠశాలలో పర్యటించి ఉపాధ్యాయులతో పీఆర్టీయూ సభ్యత్వ నమోదు చేయించారు. ఈ మేరకు.. వారు మాట్లాడుతూ..త్వరలో ఏకీకృత సర్వీసులు ఉపాధ్యాయులకు ఎంఈఓలు, జేఎల్, డైట్ లెక్షరర్లుగా పదోన్నతులు ఇప్పించేదుకు కృషి చేస్తామన్నారు. ఇటీవల జరిగిన బదిలీ పదోన్నతుల్లో రిలీవ్ కాని ఉపాధ్యాయులను రిలీవ్ చేసేలా సంఘం కృషిచేస్తుందన్నారు. పీఆర్టీయూ మండల అధ్యక్షుడు సత్యనారాయణరెడ్డి, ప్రధాన కార్యదర్శి విశ్వనాథ్, జీహెచ్ఎంలు అశోక్ అన్నపూర్ణ, సత్యనారాయణ, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

## సైబర్ నేరగాళ్లపై అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న ఏఎస్ఐ ఆంజనేయులు

నారాయణపేట రూరల్: సాంకేతిక పరిజ్ఞానం పెరుగుతుండటంతో సైబర్ నేరగాళ్లపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఏఎస్ఐ ఆంజనేయులు అన్నారు. పట్టణ శివారులోని నక్కరామయ్య కాలనీలో శుక్రవారం సురక్షపోలీస్ కళాబృందం ఆధ్వర్యంలో అవగాహన నిర్వహించారు. ఈ మేరకు.. ఆయన మాట్లాడుతూ.. అపరిచితులపై అప్రమత్తంగా ఉండాలని, తెలియని వారికి సెల్‌ఫోన్ ఇవ్వడం చేయొద్దన్నారు. అనవసరమైన లింకులు మొబైల్‌కు వస్తే ఓపెన్ చేయరాదని, తక్కువ ధరలకు ఆన్‌లైన్‌లో వస్తువులు అమ్ముతున్నట్లు ప్రకటనలు చూసి మోసపోవద్దన్నారు. ఎక్కడైన అనుమానం వస్తే వెంటనే టోల్‌ఫ్రీ నంబర్ 193కుగాని డయల్ 100, 112లకు ఫోన్‌చేసి సమాచారమివ్వాలన్నారు. విద్యార్థినుమహిళలు అత్యవసర సమయంలో తమ రక్షణకు షీటీం ఉంటాయనే విషయంపై తెలుసుకుని ఉండాలన్నారు. మహిళలు, బాలికలతో ప్రేమ పేరుతో వేధింపులకు పాల్పడితే వెంటనే డయల్ 100, మహిళా హెల్ప్‌లైన్ నంబర్ 8712670398కు కాల్ చేసి ఫిర్యాదు చేయాలన్నారు. కార్యక్రమంలో లింగన్న, రుక్యానాయక్, కళ్యాణి పాల్గొన్నారు.

## కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ



చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

ఊట్కూరు: మండలంలోని స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను అందించారు. మంజూరైన 24మందికి కల్యాణలక్ష్మి చెక్కులు అందించారు. ఈ మేరకు.. ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం పేదబడుగుబలహీన వర్గాలను ఆదుకునేందుకు ఎన్నో సంక్షేమ పథకాలను చేపట్టినట్లు తెలిపారు. ఆరు గ్యారంటీలలో భాగంగా ప్రభుత్వం రెండు లక్షల లోపు వారికి రుణమాఫీ ప్రక్రియ కొనసాగుతుందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ధనుంజయ్యగౌడ్, ఎంపీఓ నర్సింహరాజు, నాయకులు యజ్ఞేశ్వర్‌రెడ్డి, మక్తల్ ఇబ్రహీం తదితరులు పాల్గొన్నారు.

మక్తల్: మున్సిపాలిటీ పరదిధిలో గార్లపల్లికి చెందిన మ్యాకలి శివప్ప ఇటీవల మృతి చెందారు. శుక్రవారం సీఎం సహాయనిధి కింద మంజూరైన చెక్కును ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి బాధిత కుటుంబానికి చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ హన్మంతు, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గణేష్‌కుమార్, మాగనూర్ మండల అధ్యక్షుడు ఆనంద్‌గౌడ్, కావలి తాయప్ప, నాగేందర్, అశోక్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

### విద్యార్థులకు వైద్యపరీక్షలు



కృష్ణా: మండలంలోని ముడుమాల్‌లో ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు శుక్రవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు కంటి, పంటి, చర్మ, వినికిడి, రక్తహీనత తదితర సమస్యలపై పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ మేరకు.. రాష్ట్రీయ బాల స్వస్థ కార్యక్రమం(ఆర్‌బీఎస్‌కే) సిబ్బంది మాట్లాడుతూ.. విద్యార్థుల ఆరోగ్యం, పరిశుభ్రత తదితర అంశాలపై పలు సూచనలు అందజేశారు. ఆర్‌బీఎస్‌కే సిబ్బంది అన్వేష్, ప్రవీణ, భాగ్యలక్ష్మీ, హెచ్‌ఎం శేఖర్, ఉపాధ్యాయులు రమణ, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

## ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలి



మాట్లాడుతున్న జిల్లా అధికార ప్రతినిధి నర్సన్‌గౌడ్

మరికల్: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో అధికశాతం పార్టీ అభ్యర్థులను గెలిపించుకునేందుకు క్షేత్రస్థాయిలో బలోపేతం కావాలని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి నర్సన్‌గౌడ్ అన్నారు. మండలంలోని శుక్రవారం మండల విస్తృత స్థాయి కార్యవర్గ సమా వేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పార్టీ ముఖ్య నాయకులు మండలంలో ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న ప్రధాన సమస్యలను ఎలా పరిష్కరించుకోవాలనే అంశాలను ఎజెండాలో పెట్టారు. వాటి పరిష్కారం కోసం గ్రామస్థాయి నుంచి ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలన్నారు. భాస్కర్‌రెడ్డి, నాయకులు మల్లయ్య, వేణు, తిరుపతిరెడ్డి, బసిరెడ్డి, విజయ్‌రెడ్డి, రాజేష్, శ్రీరాం, రాములు, ఆంజనేయులు, వెంకటేష్, నరేష్‌గౌడ్ పాల్గొన్నారు.

**సమస్యలపై రాజీలేని పోరాటం..**

నర్వ: మండల ప్రధాన సమస్యలపై బీజేపీ రాజీలేని పోరాటం చేస్తుందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యులు బంగ్లా లక్ష్మీకాంత్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కార్యవర్గ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మండలంలో పాలకుల అసమర్థతతో ఎన్నో ప్రధాన సమస్యలు నేటికి అపరిష్కృతంగా మిగిలాయన్నారు. ప్రధానంగా సాగునీటి బెక్కర్‌పల్లి, నాగిరెడ్డిపల్లి, చంద్రఘడ్, కొందొడ్డి లిఫ్టపనులతోపాటు పాథర్చేడ్, జంగంరెడ్డిపల్లి లిఫ్ట్‌లను పూర్తిచేసి రైతంగాన్ని ఆదుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు వావిళ్ల రవికుమార్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రావు, జగన్నాథం, వెంకట్‌రెడ్డి, బ్రహ్మనందారెడ్డి, అజిత్ తదితరులు పాల్గొన్నారు.

### గోరింటాకు పండగ



నారాయణపేట రూరల్: ఆశాఢ మాసాన్ని పురస్కరించుకుని పట్టణంలోని శ్రీహంసవాహిని ఉన్నత పాఠశాలలో శుక్రవారం విద్యార్థులు గోరింటాకు పండగ నిర్వహించుకున్నారు. తరగతుల వారిగా బాలికలు ఒక్కచోటకు చేరుకుని చేతికి గోరింటాకును ఒకరికొకరు పూసుకుని సందడి చేశారు. ఉపాధ్యాయులు సుజాత, నమ్రత, సౌజన్య, అమల, అఖిల, భారతి, శ్రీనివాస్, ఉదయ్ పాల్గొన్నారు.

## పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి



ధన్వాడలో డ్రైడే నిర్వహిస్తున్న ప్రభుత్వ ఆస్పత్రి సిబ్బంది

ధన్వాడ: ప్రతి ఒక్కరూ తమ ఇంటి పరిసరాలలో నీటిని నిల్వలేకుండా చూసుకోవాలని సూపర్‌వైజర్ అశోక్‌కుమార్ అన్నారు. శుక్రవారం ఫ్రైడే.. డ్రైడే కార్యక్రమం సందర్భంగా మండల కేంద్రంలో ప్రభుత్వ ఆస్పత్రి ఆధ్వర్యంలో గ్రామస్తులకు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ మేరకు.. మాట్లాడుతూ.. వర్షాకాలంలో రోగాలు అధికంగా వ్యాపించే అవకాశం ఉందని, ఎక్కువగా డెంగ్యూ, మలేరియా వంటి రోగాలు దోమల వ్యాప్తితో వస్తుందని దోమల నివారణకు ప్రతి ఒక్కరూ తమ ఇంటి చుట్టూ పక్కల ఎక్కడ కూడా నీరు నిల్వలేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్‌రావు, కథలప్ప, ఆశాకార్యకర్తలు తదితరులు ఉన్నారు.

## మొక్కలు నాటి సంరక్షించాలి



మొక్కలు నాటుతున్న జీహెచ్ఎం వేణుగోపాల్

నారాయణపేట రూరల్: ప్రతి ఒక్కరూ విధిగా మొక్కలు నాటి సంరక్షించాలని జీహెచ్ఎం వేణుగోపాల్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని ప్రభుత్వ గ్రౌండ్ ఉన్నత పాఠశాలలో వనమహోత్సవ కార్యక్రమంలో భాగంగా పాఠశాల ఆవరణలో వివిధ రకాల మొక్కలు నాటారు. అదేవిధంగా కిచెన్ గార్డెన్ ఏర్పాటుకు అవసరమైన కూరగాయాల మొక్కలు సైతం ఏర్పాటుచేశారు. అనంతరం విద్యార్థులకు మొక్కలు నాటడంతో కలిగే లాభాలను వివరించారు. భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన గాలి అందడటమే కాకుండా సకాలంలో వర్షం కుస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### చలో ఢిల్లీ విజయవంతం చేయాలి..

మాగనూర్: మాదిగల మహాధర్నా ఆగస్టు 9న నిర్వహిస్తున్నట్లు ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఉజ్జెల్లి వెంకటేష్ అన్నారు. చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుతూ శుక్రవారం స్థానిక అంబేడ్కర్ చౌరస్తాలోని అంబేద్కర్ విగ్రహం ఎదుట కరపత్రం విడుదల చేశారు. ఎంఆర్పీఎస్ చెన్నప్ప, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

## ఆలయానికి వెళ్లే దారి వెడల్పు చేయాలని వినతి

కొత్తకోట రూరల్: పట్టణ శివారులో గల వెంకటగిరి ఆలయానికి వెళ్లే దారి వెడల్పు చేయాలని కోరుతూ కొత్తకోట ప్రజలు, కాంగ్రెస్ నాయకులు దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డిని శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు. వెంకటగిరి ఆలయానికి పట్టణ కేంద్రంతో పాటు నిర్వేన్, పాలెం, రామనంతాపురం గ్రామాలకు చెందిన భక్తులు, ప్రజలు వారంలో రెండు సార్లు ఆలయానికి రాకపోకలు సాగిస్తుంటారు. ఆలయానికి వెళ్లే దారి చెరువు కట్టపై ఉండటంతో పాటు సరిగ్గా లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, అంతే కాకుండా పట్టణవాసులు వాకింగ్ చేసేందుకు ఎలాంటి మైదానాలు లేకపోవడంతో వెంకటగిరి ఆలయానికి వెళ్లే చెరువుకట్టపై రోడ్డు సౌకర్యం ఏర్పాటు చేస్తే అందరికీ అనుకూలంగా ఉంటుందని వినతిపత్రంలో పేర్కొన్నారు. ఎమ్మెల్యేను కలిసి వినతిపత్రం అందజేసిన వారిలో ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.ప్రశాంత్, పాపయ్యగారి కృష్ణారెడ్డి, రాములుయాదవ్, శంకర్‌యాదవ్, సాయిలుయాదవ్ తదితరులు ఉన్నారు.

### జూరాల వద్ద భద్రతా ఏర్పాట్లు

అమరచింత: జూరాల ప్రాజెక్టు దిగువ నదిలోకి ఎవరూ వెళ్లకుండా ముళ్ల కంచెను ఏర్పాటు చేసి కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేశామని సీఐ శివకుమార్ తెలిపారు. ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి భారీ స్థాయిలో వరదనీరు వచ్చి చేరుకోవడంతో జూరాల క్రస్ట్ గేట్లను తెరిచి నీటిని దిగువకు వదులుతున్నారు. జూరాల ప్రాజెక్టు దిగువ ప్రాంతంలో కృష్ణానది ఉగ్రరూపంలో ప్రవహిస్తుండటంతో ఎలాంటి ప్రమాదాలు చోటుచేసుకోకుండా ఎస్పీ ఆదేశాల మేరకు శుక్రవారం అమరచింత పోలీసులతో కలిసి పుష్కరఘాట్లకు వెళ్లే రహదారులను మూసి ఉంచారు. వీటితో పాటు ప్రతి నిత్యం పోలీసు పహారా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐ సురేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### ఈత మొక్కలు నాటాలి..

కోయిల్‌కొండ: గీతకార్మికులు ఈత మొక్కలు నాటేందుకు ముందుకు రావాలని ఎంపీడీఓ కాళప్ప సూచించారు. శుక్రవారం గార్లపహాడ్ పరిసర ప్రాంతాల్లో గీతకార్మికులతో కలిసి ఈత మొక్కలు నాటారు. ప్రభుత్వం ఉచితంగా ఈత మొక్కలను అందిస్తోందని తెలిపారు. కార్యక్రమంలో గీత కార్మికులు శ్రీహరిగౌడ్, మల్లేష్‌గౌడ్, మల్లికార్జున్‌గౌడ్, నాగార్జున్‌గౌడ్, సుదర్శన్‌గౌడ్ పాల్గొన్నారు.

## ఘనంగా కార్గిల్ దివాస్



పేటలో ర్యాలీ చేపట్టిన బీజేపీ యువజన నాయకులు



ఊట్కూర్‌లో..

నారాయణపేట: ఈ దేశంలో ఉండాలంటే వందేమాతరం పాడాల్సిందే క్షణం క్షణం భరతమాతకే సమర్పణం ఖబర్దార్ దేశద్రోహుల్లారా ఖబడ్దార్ అంటూ నినాదాలతో యువజన కార్యకర్తలు బీజేపీ యువమోర్చా అధ్యక్షుడు భరత్ కుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం కార్గిల్ అమరవీరుల కాగడాల ర్యాలీని జిల్లా కేంద్రంలోని చౌక్‌బజార్ నుంచి సావర్కర్ చౌరస్తాలకు విజయవంతంగా నిర్వహించారు. ఈ మేరకు.. వారు మాట్లాడుతూ కార్గిల్‌లో అమరులైన సైనికులను ప్రతి భారతీయుడు గుర్తించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ, బజరంగ్‌దళ్, బికేఎస్, ఏబీవీపీ కిసాన్ సంగ్ నాయకులు పాల్గొన్నారు.

ఊట్కూరు: మండలంలోని శుక్రవారం ఘనంగా కార్గిల్ విజయ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కార్గిల్ యుద్ధంలో మృతిచెందిన అమరవీరులకు ఘనంగా నివాళులర్పించారు. ఈమేరకు.. లయన్స్‌క్లబ్ వారి ఆధ్వర్యంలో పోలీస్‌సిబ్బందికి శాలువాతో సత్కరించారు. ఈ మేరకు.. మాజీ ఎంపీటీసీ హన్మంతు మాట్లాడుతూ యువకులు చిన్నప్పటి నుంచి దేశభక్తి, దైవభక్తి కలిగి ఉండాలని అన్నారు. గత 25 ఏండ్లుగా కార్గిల్ విజయోత్సవ దినోత్సవాన్ని యువకులు నిర్వహించడం సంతోషకరమని అన్నారు. అనంతరం మిఠాయిలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ సభ్యులు వసంత్‌కుమార్, శంకర్, హర్షవర్ధన్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, అయ్యప్పరెడ్డి, అరవింద్, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారమే ధ్యేయం



విద్యార్థులతో సభ్యత్వ నమోదు చేయిస్తున్న ఏబీవీపీ నాయకులు

నారాయణపేట రూరల్: విద్యారంగ సమస్యల పరిష్కారమే ధ్యేయంగా అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ పనిచేస్తుందని ఆ సంఘం జిల్లా కన్వీనర్ నరేష్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని లిటిల్‌స్టార్స్, కృష్ణవేణి, శ్రీహంసవాహిని స్కూల్‌లలో సభ్యత్వ నమోదు చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏబీవీపీలో సభ్యత్వం తీసుకోవం ఎంతో అదృష్టమని, సంఘంలో పనిచేసిన ప్రతి ఒక్కరూ క్రమశిక్షణ అలవర్చుకుంటారని అన్నారు. ప్రభుత్వం విద్యారంగాన్ని చిన్నచూపు చూస్తుందని, ప్రభుత్వ విద్యావ్యవస్థను భ్రష్టు పట్టిస్తుందని దుయ్యబట్టారు. ఈ కార్యక్రమంలో నగర కార్యదర్శి చరణ్‌రెడ్డి, నవీన్, సతీస్, సాయి పూజిత, రేణుక, శ్రీజ తదితరులు పాల్గొన్నారు.